క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ చీరాల ఇన్‌చార్జిని కలిసిన కర్నేటి



కరణం వెంకటేష్‌ను కలిసిన కర్నేటి వెంకట ప్రసాద్

చీరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నేటి వెంకట ప్రసాద్ గురువారం ఒంగోలులోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన అనంతరం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసినట్లు కర్నేటి వెంకట ప్రసాద్ తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, కంభం ఏఎంసీ మాజీ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు ఉన్నారు.

హోలీ.. రంగులు



దగ్గుబాడులో హోలీ జరుపుకుంటున్న చిన్నారులు

దగ్గుబాడు(కారంచేడు): హోలీ పండగ పురస్కరించుకొని గురువారం ముందస్తు హోలీ సంబరాల్లో చిన్నారులు మునిగిపోయారు. మండలంలోని దగ్గుబాడు అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలితో పాటు చిన్నారులు హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. శరీరానికి ఎలాంటి హాని జరిపించని విధంగా సహజసిద్ధమైన రంగులతో వారు ఒకరికొకరు హోలి రంగులు వేసుకున్నారు. అలాగే రంగురంగుల కాగితాలతో తయారు చేసిన ఆకృతులతో వారు చక్కగా ఆడిపాడుకున్నారు.

నేడే శింగరకొండ తిరునాళ్ల

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి, కొండపైనున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివార్ల వార్షిక ప్రధాన తిరునాళ్ల శుక్రవారం జరగనుంది. అందుకు అవసరమైన ఏర్పాట్లను దేవస్థానం, వివిధ శాఖల అధికారులు పూర్తి చేశారు. క్షేత్రానికి చేరుకోవడనికి అద్దంకి డిపో నుంచి ప్రతి నిమిషానికి ఒక ప్రత్యేక బస్సు అద్దంకి నుంచి తిప్పనున్నారు.

పాఠశాలకు విద్యార్థినుల చేయూత



పదో తరగతి బాలికలతో ఉపాధ్యాయ బృందం

మార్టూరు: స్థానిక మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఏ సెక్షన్‌కు చెందిన విద్యార్థినులు తాము చదువుతున్న పాఠశాలకు చేయూతనిచ్చారు. పాకెట్ మనీలో దాచుకున్న నగదు మొత్తాన్ని లెక్కించగా 7,500 రూపాయలున్నాయి. కూడబెట్టిన మొత్తాన్ని బాలికలు గురువారం తమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూత్ మెర్సీ జాయ్‌కి అప్పగించి తమ ఆలోచనను ఆమెతో పంచుకున్నారు. బాలికల కోరికను తెలుసుకున్న ఆమె వారిని అభినందిస్తూ ఆ మొత్తంతో పాఠశాలకు అవసరమైన కుర్చీని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలికలను వారి తరగతి ఉపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్లు అభినందించారు.

ట్రాక్టర్ పోయిందంటూ ఫిర్యాదు

చినగంజాం: ట్రాక్టర్ పోయిందంటూ ఓ వ్యక్తి చినగంజాం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. కారంచేడు మండలానికి కేశవరప్పాడు గ్రామానికి చెందిన చిరమల అంకసుబ్బారావు అందించిన ఫిర్యాదు మేరకు తను చినగంజాం మండలం సంతరావూరు గ్రామంలో పొలం కౌలుకు తీసుకొని మిరప సాగు చేస్తున్నాడు. అతడు ఫిబ్రవరి 6వ తేదీన పొలంలో నీరు పెడుతూ పొద్దుపోయిన తరువాత ట్రాక్టర్‌ను అక్కడే వదలి పెట్టి ఇంటికి వెళ్ళిపోయాడు. మరుసటి రోజు 7వ తేదీ పొలంలో వచ్చి చూడగా అతని ట్రాక్టర్ కన్పించలేదు. దాంతో అతడు అతని ట్రాక్టర్‌పై అన్ని చోట్లా వెదికినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పేర్ని లింగేశ్వరరావు(ప్రకాష్) తెలిపారు.

నల్ల చెరుకు ఖుషీ..ఖుషీ

- అద్దంకి నియోజకవర్గంలో 950 ఎకరాల్లో సాగు
- అమ్మకానికి సిద్ధంగా నల్లచెరుకు గడలు
- గడ రూ. 20 నుంచి రూ.25 వరకు కొనుగోళ్లు
- పెట్టుబడులు పోను ఎకరాకు రూ. 1.5 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు ఆదాయం



చెరుకు నరుకుతున్న కూలీలు

బల్లికురవ: ఆహార ధాన్యమైన వరి సాగుకు పెట్టుబడులు పెరగటం, వాణిజ్య వ్యాపార పంటల ఆటుపోట్లతో విసిగి వేశారిన రైతులు తిరునాళ్ల, జాతర్లలో అమ్మే నల్లచెరుకు సాగుతో లాభాలు అర్జిస్తున్నారు. బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గం నల్లచెరుకు సాగుకు పెట్టింది పేరు. రైతుల పొలాల్లో బోర్లు ఏర్పాటు, డ్రిప్ ఇరిగేషన్ హెచ్‌వీడీఎస్ పథకంలో విద్యుత్ కనెక్షన్ ముగ్గురు లేదా నలుగురు రైతులకే ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ పొందటం సాగులో మెళకువలు పాటిస్తున్నారు.

పెరుగుతున్న సాగు..

బల్లికురవ మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు, వైదన, వి. కొప్పరపాడు, ఎస్ఎల్ గుడిపాడు, కొత్తూరు, రామాంజనేయపురం, అంబడిపూడి, కొమ్మినేనివారి పాలెం అద్దంకి మండలంలోని శింగరకొండపాలెం, చక్రాయపాలెం గ్రామాలతో కలిపి తొలకరి వర్షాలకు మే చివరి నుంచి జూన్, జూలై, రెండోవారం వరకు సుమారు 950 ఎకరాల్లో సాగు చేశారు. గత ఏడాది 860 ఎకరాల్లో సాగుగా విస్తీర్ణం పెరిగింది. వేసవి దుక్కులు తదుపరి ఎకరాకు 10 ట్రక్కుల పశువుల ఎరువుతో కలయదున్ని బోదెలు చేసి ఆ బోదెలో అడుగు ముక్కలను రూ. 10 వేల నుంచి రూ.12 వేల వరకు నాటారు. సస్యరక్షణ నీటితడులతో 8 నుంచి 9 నెలలకు గడలు పక్వానికి వచ్చి 6 నుంచి 7 అడుగుల మేర ఎత్తు పెరుగుతాయి. మహా శివరాత్రి పర్వదినం నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో జరిగే తిరునాళ్ల జాతర్లకు వ్యాపారులే తోటల వద్దకు వచ్చి గడలు, ఎకరాల వంతున కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.22 వేల వరకు గడలు దిగుబడులు ఇస్తున్నాయి. గడ ఒక్కోటి రూ. 20 నుంచి రూ.25 వరకు ఎకరా వంతున ఎకరా రూ. 4 లక్షల నుంచి 4.5 లక్షల వరకు కొనుగోలు జరుగుతున్నాయి.



కట్టలు కట్టి ఎగుమతికి సిద్ధంగా ఉన్న చెరుకు



కొప్పరపాడు వద్ద నాం రోడ్డుపై అమ్మకాలు

నామ్ రహదారిపై అమ్మకాలు

సొంత భూమిలో సాగుదారుడికి ఎకరాకు రూ 1.5 లక్షలు కౌలు భూముల్లో రూ.1.6 లక్షల నుంచి రూ. 1.8 లక్షలు ఖర్చులు అవుతున్నాయి. దళారుల బెడద లేకుండా వ్యాపారులే కొనుగోలుతో పెట్టుబడులు పోను రూ. 2 లక్షల వరకు నికర ఆదాయం దక్కుతున్నట్లు రైతులు వివరించారు. మేదరమెట్ల-నార్కెట్‌పల్లి నాం రహదారి కొప్పరపాడు సబ్‌స్టేషన్ వద్ద అమ్మకాలు చేపడుతున్నారు. 10 గడలు కట్టగా కట్టి రూ. 250 నుంచి 200 వరకు విక్రయిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇక్కడ హోల్‌సేల్ రిటైల్ అమ్మకాలు జరుగుతున్నాయి.

దళారుల బెడదలేదు



పదేళ్లుగా చెరుకుసాగు చేస్తున్నా దళారుల బెడదలేదు. వ్యాపారులే తోటల వద్దకు వచ్చి గడలు ఎకరాల్లో సాగు చేశాను. పెట్టు బడులు పోను రూ. 2 లక్షల వరకు నికర ఆదాయం దక్కింది.

భవనం అంజిరెడ్డి (కూకట్లపల్లి, రైతు)

ఎకరాలో చెరుకు సాగుచేశా



12 సంవత్సరాలుగా చెరకుసాగు చేస్తున్నా. వాతావరణం అనుకూలించటం సాగులో మెళకులతో నాణ్యతతో దిగుబడులు బాగుంటున్నాయి. వ్యాపారులే తోటల వద్దకు వచ్చి కొనుగోలుతో సొమ్ము చేతి కందుతోంది.

బోళ్ల ఏడుకొండలు రెడ్డి, కూకట్లపల్లి

లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పరిశీలన



లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలను పరిశీలిస్తున్న ఇంజినీర్, పెద్దలు

పర్చూరు(చినగంజాం): పర్చూరులో మూలన పడిన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలను వినియోగంలోనికి తీసుకొని వచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా గురువారం రిటైర్డు ఇంజినీర్ ఎంవై సత్యనారాయణ స్కీంలను పరిశీలించి అంచనాలను రూపొందించారు. పర్చూరు వాగుపై రైతుల కొరకు 800 ఎకరాల ఆయకట్టుతో వెంకటేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, 400 ఎకరాల ఆయుకట్టుతో బోడవాడ రైతుల కోసం నివేదిత లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలను గతంలో ప్రభుత్వాలు ఉపయోగంలోకి తీసుకురాగా నివేదిత స్కీం 5 గ్రామాల రైతులను ఆదుకుంటోంది. అయితే స్కీంలలోని లక్షలు విలువ చేసే 60 హెచ్‌పీ ఇంజన్‌లను దొంగలు అపహరించుకు వెళ్ళారు. ప్రస్తుతం ఈ స్కీములన్నీ నిరుపయోగంగా ఉండి అడవిని తలపిస్తున్నాయి. వీటిని ఉపయోగంలోకి తీసుకురావటానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా రిటైర్డ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో స్కీంలను పునరుద్ధరించేందుకు అంచనాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆకుల శ్రీనివాసరావు, బుల్లిబాబు, గడ్డిపాటి శ్రీనివాసరావు, తులసి శంకర్, వెలగా శ్రీనివాసరావు, కోట మధు, తులసి సాంబయ్య, ఆచంట సుబ్బారావు, శిరిగిరి నాగేశ్వరరావు, శృంగవరపు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్వారీల్లో యువతకు ఉపాధి



మాట్లాడుతున్న ఆర్డీఓ

బల్లికురవ: గ్రానైట్ క్వారీల నిర్వాహకులు పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతూ ఆయా గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు కోరారు. గురువారం బల్లికురవ పంచాయతీలోని కొండాయపాలెం గ్రామ సమీపంలో సర్వే నంబరు 243, 244లో 3.7 హెక్టార్లకు వింటర్ మైన్స్ అండ్ మినరల్స్ క్వారీ ఏర్పాటుకు పర్యావరణ, ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఆర్డీవో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల కార్మికులను పనుల్లో పెట్టుకోకుండా స్థానికులకు అవకాశాలు కల్పించాలని చెప్పారు. క్వారీ నిర్వాహకులు ఆయా గ్రామాల పరిధిలో శాశ్వతంగా గుర్తుండే పనులను చేయాలని చెప్పారు. క్వారీల నుంచి తీసే రాయి ఎగుమతుల్లో ప్రభుత్వానికి చెల్లించే రాయల్టీ ద్వారానే గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ జిల్లా పరిషత్‌కు ఆదాయం సమకూరుతుందని చెప్పారు. ఈ ఆదాయం వల్లే అభివృద్ధి పనులు శరవేగముగా జరుగుతున్నాయని చెప్పారు. అక్రమంగా రాయి ఎగుమతుల వల్ల అభివృద్ధి పనులకు విఘాతం కలుగుతుందని చెప్పారు. అక్రమంగా తరలించే వాహనాలు వ్యక్తులపై నిఘా పెట్టాలని చెప్పారు. క్వారీలో పనిచేసే ప్రదేశం, రహదారుల వెంట దుమ్ము, ధూళి లేకుండా ప్రతి రోజూ రహదారిలో నీళ్లు చల్లించాలని, క్వారీ నిర్వాహకులు అంతా కార్మికులకు ఆరు నెలలకు ఒక సారి ఒకేషనల్ శిక్షణ వైద్య పరీక్షలు చేయించాలని చెప్పారు. అప్పుడే క్వారాల్లో ప్రమాదాలకు చెక్‌పెట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పర్యావరణ శాఖ ఈఈ రాఘవరెడ్డి, తహసీల్దార్ రవీ నాయక్, ఆర్. పోతురాజు, రెవెన్యూ సబ్బంది పాల్గొన్నారు.

స్వామిత్ర సర్వే నిర్వహించండి



సూచనలు చేస్తున్న డీఎల్‌పీఓ ప్రభాకరరావు

చీరాల టౌన్: గ్రామ పంచాయతీలో చేపట్టనున్న స్వామిత్ర సర్వేను పంచాయతీ రాజ్ అధికారులు పర్యవేక్షణలో ఉద్యోగులు పకడ్బందీగా, తప్పులు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని బాపట్ల జిల్లా డీపీఓ కె.ఎల్. ప్రభాకరరావు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో చీరాల మండలంలోని గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల అడ్మిన్లు, డిజిటల్ అసిస్టెంట్లతో స్వామిత్ర సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చీరాల ఈవోఆర్డీ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి డీపీవో ప్రభాకరరావు, డీఎల్‌పీఓ శివన్నారాయణ, ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు హాజరయ్యారు. శిక్షణ కార్యక్రమంలో డీపీఓ మాట్లాడుతూ స్వామిత్ర సర్వే వలన గ్రామ పంచాయతీల్లోని ప్రజలకు చాలా ఉపయోగాలున్నాయన్నారు. సాంకేతికంగా ఉన్న అన్ని సదుపాయాలను వినియోగించుకుని స్వామిత్ర సర్వేను ఏయే విభాగాల్లో చేయాలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు వివరించారు. మండల పరిషత్ అధికారి, డీఎల్‌పీఓ పర్యవేక్షణలో మండలానికి నియమించిన బృందం స్వామిత్ర సర్వే పర్యవేక్షణ చేస్తుందని, తప్పులు, ఇతర సమస్యలు లేకుండా సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు.

లోకోస్ యాప్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏపీఎం

అద్దంకి: జాతీయ స్థాయిలో రూపొందించిన లోకోస్ యాప్‌పై గ్రామ సంఘాల సహాయకులు అవగాహన కలిగి ఉండాలని అద్దంకి ఏపీఎం కోటేశ్వరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వీఓఏల శిక్షణ కార్యక్రమం గురువారం మొదలైంది. ఈ సందర్భంగా ఏపీఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ సంఘాల లావాదేవీలన్నీ జాతీయ స్థాయిలో ఇచ్చారని చెప్పారు. ఇంకా ఈ యాప్‌లో పది శాతం పొందుపరచాల్సి ఉందని చెప్పారు. లావాదేవీలు 100 శాతం యాప్‌లో నమోదయ్యేలా వీఓఏలు చూడాలని చెప్పారు. కొరిశపాడు ఏపీఎం మాణిక్యరావు మాట్లాడుతూ మార్చి 31 లోపు ఎస్‌హెచ్‌జీ వీవో ప్రొఫైల్ 100 శాతం పూర్తి కావాలని చెప్పారు. లోకోస్ యాప్‌లో తలెత్తే సమస్యలను తీర్చడం కోసం యాంకర్ పర్సన్ కోటేశ్వరరావు, వీఓఏలు, అద్దంకి సీసీ బ్రహ్మయ్య, శ్రీను, విజయరాణి, ఏసయ్య, అకౌంటెంట్ శ్యామల పాల్గొన్నారు.

కమనీయం వేణుగోపాల స్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామి

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీలోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మందిరంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోత్తంగా జరిపించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, వివిధ రకాల అభిషేకాలను నిర్వహించారు. వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా కళ్యాణ మహోత్సవం అనంతరం స్వామివార్ల రథోత్సవాన్ని గ్రామంలో నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే వాడరేవు సముద్ర తీరంలో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో సాగర హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



పరీక్ష రాసేందుకు మెటీరియల్ అందిస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు(చినగంజాం): పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్ష రాసేందుకు అవసరమైన మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. రోటరీ సభ్యులు నర్రా వెంకటేశ్వరరావు, లక్ష్మీసుధా దంపతులు, విద్యార్థులు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర సామగ్రి బహూకరించారు. అన్నంబొట్లవారిపాలెం, అడుసుమల్లి, వీరన్నపాలెం, చెరుకూరు, పర్చూరు వైఐఆర్ హైస్కూల్‌కు సంబంధించిన 190 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. ఇన్‌చార్జ్ అధ్యక్షుడు పాబోలు వెంకన్న, కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు నాగభైరు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రం పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొన్న కారు

చినగంజాం: ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన సంఘటనలో నలుగురు గాయాలపాలైన సంఘటన చినగంజాం జాతీయరహదారిపై గురువారం చోటు చేసుకుంది. పోలీసులు అందించన సమాచారం ప్రకారం.. బాపట్లకు చెందిన కాట్ర రమేష్ బాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డిలు, డ్రైవర్ జగన్‌లు ఒంగోలులో పని ముగించుకొని కారులు తిరిగి బాపట్ల వెళుతున్నారు. చినగంజాం జాతీయ రహదారిపై టోల్‌గేట్ దానిటి తరువాత రొయ్యల చెరువు సమీపానికి వచ్చేసరికి ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టారు. ఈ సంఘటనలో వారు ప్రయాణిస్తున్న కారు నుజ్జునుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తో సహా మిగిలిన ముగ్గురు గాయాలపాలయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్నిలింగేశ్వరరావు(ప్రకాష్) తెలిపారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

చినగంజాం: మహిళను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై చినగంజాం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు అందించన సమాచారం.. ప్రకారం పెదగంజాం ఎస్సీ కాలనీకి చెందిన చాట్ల పున్నమ్మను అదే కాలనీకి చెందిన దార్ల యోహాను వెంటబడి వేధిస్తున్నాడు. ఆమె కూలీ పనుల కోసం బయటకు వెళుతున్న సమయంలో వెంటబడి ఇబ్బందికి గురిచేస్తున్నాడు. దాంతో ఆమె భర్తకు విషయం తెలియజేసింది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఆమె బహిర్భూమికి తన భర్తను తోడు తీసుకొని వెళ్ళింది. ఆ సమయానికి అక్కడే ఉన్న యోహాను ఆమె పట్టుకొని ప్రయత్నం చేశాడు. దాంతో భర్త అక్కడకు వెళ్ళి అతనితో వివాద పడుతుండగా భార్యభర్తల కళ్ళలో ఇసుక చల్లి యోహాను పరారయ్యాడు. ఈ విషయమై పున్నమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శీలం రమేష్ తెలిపారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జె.పంగులూరు: మండలంలోని 16 వ నెంబర్ జాతీయ రహదారిపై కారు తిరగడ్డ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం గురువారం జాగర్లమూడివారిపాలెం ఫ్లైవోవర్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. తిరుపతి నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు వేగంగా వెళుతూ ఎదురుగా వెళుతున్న వాహనాన్ని బలంగా ఢీ కొని డివైడర్‌దాటి ఒంగోలు రోడ్డులో పడిపోయింది. కారులో ప్రయాణిస్తున్న కార్తీక్, హైమావతికు తీవ్ర గాయాలు కాగా, హిమజకు స్వల్పగాయలయ్యాయి. ఒంగోలులోని సంఘమిత్ర వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ వైర్లు తగిలి పశుగ్రాసం దగ్ధం

బల్లికురవ: కిందకు జారిన విద్యుత్ వైర్లు తగిలి వరిగడ్డి దగ్ధమైన సంఘటన మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో గురువారం జరిగింది. అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన అరిపినేని శేషయ్య తనకున్న ఎకరాన్నర పొలంలోని వరిగడ్డిని పశుగ్రాసం కోసం ట్రాక్టర్‌పై వేసుకుని ఇంటికి తరలిస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ గ్రామ సమీపంలోని జగనన్నకాలనీ వద్ద కిందకు జారిన విద్యుత్ సప్‌లై వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే అద్దంకి అగ్నిమాపక యంత్రానికి సమాచారం ఇవ్వడంతో వెంటనే అక్కడికి వచ్చిన అగ్నిమాపక యంత్రం పరిసరాలకు మంటలు వ్యాపించకుండా నారు చల్లి అదుపులోకి తెచ్చారు. మంటల్లో కాలిపోయిన వరిగడ్డి విలువ రూ.30 పైనే ఉంటుందని రైతులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కిందకు జారిన వైర్లు సరి చేసేందుకు ఎస్టిమెట్‌తో మంజూరైనా ఇంత వరకు నూతన ప్రభుత్వంలో జారీ చేయకపోవడంతో ఇలాంటి నష్టాలు జరుగుతున్నాయని వాపోయారు.

రైలు నుంచి జారిపడి వృద్ధురాలు మృతి

చీరాల రూరల్ : రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన గురువారం చీరాల –స్టూవర్టుపురం రైల్వేస్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. మృతురాలు వయస్సు 65 సంవత్సరాలు ఉంటాయని చెప్పారు.